క్లుప్తంగా

వరి పంట పరిశీలన



పంటను పరిశీలిస్తున్న ఏఓ లక్ష్మి

కొడవలూరు: మండలంలోని బొడ్డువారిపాళెంలో వరి పంటను సోమవారం ఏఓ లక్ష్మి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తెగుళ్లు సోకుతాయన్న అనుమానంతో ఇష్టానుసారంగా పురుగు మందులు వాడొద్దని సూచించారు. ఫలానా తెగులు సోకిందని నిర్ధారించుకున్నాకే దాని నివారణకు అవసరమైన మందులు వాడాలన్నారు. అలా కాకుండా అధికంగా వినియోగిస్తే వెన్ను తీయడంలో సమస్యలు తలెత్తుతాయని తెలిపారు. బొడ్డువారిపాళెంలోని వరి పంట వెన్ను తీయకపోవడానికి అధికంగా పురుగు మందుల వాడకమే కారణమన్నారు. కార్యక్రమంలో వీఏఏ ఒ.సుజిత్ పాల్గొన్నారు.

సాయిభరత్‌కు డాక్టరేట్ ప్రదానం



సాయిభరత్‌కు డాక్టరేట్ ప్రదానం చేస్తున్న ఇన్‌చార్జి వీసీ విజయభాస్కరరావు

వెంకటాచలం: వీఎస్‌యూలో బిజినెస్ మేనేజ్‌మెంట్ విభాగ పరిశోధన విద్యార్థి కంచి సాయి భరత్‌కు వీఎస్‌యూ ఇన్‌చార్జి వీసీ విజయభాస్కరరావు సోమవారం డాక్టరేట్ ప్రదానం చేశారు. బిజినెస్ మేనేజ్‌మెంట్ విభాగ అధ్యాపకులు డాక్టర్ పి.చెంచురెడ్డి పర్యవేక్షణలో అధ్యయనం చేశారు.

సుబ్బయ్యకు సంతాప సభ



మాట్లాడుతున్న వెంకటేశ్వరరావు

పొదలకూరు : విశ్రాంత ఉపాధ్యాయుడు నరసాపురం సుబ్బయ్య సంతాప సభను స్థానిక ఏపీటీఎఫ్ భవన్లో సోమవారం నిర్వహించారు. సుబ్బయ్య సేవలను రాష్ట్ర ఏపీటీఎఫ్ పూర్వ అధ్యక్షుడు వెంకటేశ్వరరావు కొనియాడారు. ఈ కార్యక్రమంలో మండల ఏపీటీఎఫ్ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాల్యాద్రిరెడ్డి, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సు - బైక్ ఢీ



ప్రమాద ప్రదేశంలో గుమికూడిన ప్రజలు

వరికుంటపాడు: దట్టమైన పొగమంచు కారణంగా ఆర్టీసీ బస్సు– మోటార్ బైక్ ఎదురెదురుగా ఢీకొని ఒకరు స్వల్పంగా గాయపడిన ఘటన సోమవారం ఉదయం మండలంలోని గువ్వాడి గ్రామ సమీపంలో జరిగింది. వివరాలిలా ఉన్నాయి. ఉదయగిరి డిపోకు చెందిన బస్సు గువ్వాడి మీదుగా పామూరు వెళ్తోంది. గ్రామ సమీపంలోని మలుపు వద్దకు బస్సు రాగా జడదేవి వైపు నుంచి వస్తున్న బైక్ ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ఘటనలో కాంచెరువుకు చెందిన ఓ వ్యక్తి స్వల్పంగా గాయపడ్డాడు. ఇతన్ని పామూరు వైద్యశాలకు తరలించారు. కాగా ఈ ప్రమాదంపై పోలీసులకు ఫిర్యాదు అందలేదని ఎస్సై రఘునాథ్ తెలిపారు.

బైక్ అదుపుతప్పి..



గాయపడిన మస్తాన్‌బాషా

సోమశిల : బైక్ అదుపుతప్పి ఒకరు గాయపడిన ఘటన అనంతసాగరం మండల పరిధిలోని ఇనగలూరు గ్రామం వద్ద సోమవారం చోటుచేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.. షేక్.మస్తాన్‌బాషా అనే యువకుడు అనంతసాగరం నుంచి స్వగ్రామమైన ఇనగలూరుకు బైక్‌పై వస్తుండగా గ్రామ సమీపంలో మలుపు వద్ద ఒక్కసారిగా రోడ్డుపైకి మహిళలు అడ్డురావడంతో వారిని తప్పించే క్రమంలో బైక్ అదుపుతప్పింది. దీంతో మస్తాన్‌బాషా ముఖంపై గాయాలయ్యాయి. స్థానికులు గుర్తించి చికిత్స నిమిత్తం ఆత్మకూరు వైద్యశాలకు తరలించారు.

మొక్కుబడిగా..

- ప్రజా సమస్యల పరిష్కార వేదికపై నిర్లక్ష్యం
- కేవలం నలుగురు అధికారుల మాత్రమే హాజరు



వినతుల స్వీకరణకు హాజరైన తహసీల్దార్ వెంకటేశ్వర్లు, ఈఓపీఆర్డీ నారాయణరెడ్డి



విచ్చేసిన ఇద్దరు.. ముగ్గురు అధికారులు

బుచ్చిరెడ్డిపాళెం: వైఎస్సార్‌సీపీ హయాంలో స్పందన కార్యక్రమం పక్కాగా జరగ్గా కూటమి ప్రభుత్వంలో పరిస్థితులు దారుణంగా తయారయ్యాయి. మండలంలో ప్రజా సమస్యల పరిష్కార వేదికను మొక్కుబడిగా నిర్వహిస్తున్నారు. 20 శాఖలకు పైగా అధికారులు హాజరుకావాల్సి ఉన్నప్పటికీ సోమవారం నలుగురు మాత్రమే వచ్చారు. ముఖ్యమైన నీటిపారుదల, విద్యుత్, గృహ నిర్మాణ శాఖలతోపాటు మరికొంతమంది శాఖాధికారులు హాజరు కావాల్సి ఉంది. కానీ సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో స్వల్ప సంఖ్యలో అధికారులు వచ్చారు. ఇచ్చిన అర్జీలకు పరిష్కారం లభించకపోవడంతో ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. వినతిపత్రాలిచ్చి ఉపయోగం ఏమిటన్న కారణంతో కార్యాలయం వైపు కన్నెత్తి చూడటం లేదు. ఈ విషయమై తహసీల్దార్ వెంకటేశ్వర్లును వివరగా అడగ్గా రెండు వినతిపత్రాలు వచ్చాయన్నారు. అందులో అంగళ్ల సవరణతోపాటు మరో భూ సంబంధిత అర్జీ వచ్చిందన్నారు. వాటిని పరిష్కరిస్తామన్నారు. కాగా కార్యాలయంలో కూర్చొనేందుకు స్థలం సరిపోవడం లేదని ఉద్యోగులు చెబుతున్నారు. అందుకే ఈ పరిస్థితి ఉందంటున్నారు. మరోచోట నిర్వహిస్తే బాగుంటుందనే అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

అంగన్‌వాడీల వేతనాలు పెంచాలంటూ..



నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీలు తదితరులు

ఇందుకూరుపేట: అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్పర్ల వేతనాలు పెంచాలని డిమాండ్ చేస్తూ ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో మండల పరిషత్ కార్యాలయం ఎదుట సోమవారం ధర్నా జరిగింది. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం నెరవేర్చాలన్నారు. నెలలు గడుస్తున్నా ఇప్పటి వరకు సమస్యలు పరిష్కరించలేదన్నారు. మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మార్చాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఇందుకూరుపేట ప్రాజెక్ట్ పరిధిలోని అంగనవాడీ కార్యకర్తలు, హెల్పర్లు పాల్గొన్నారు.

కాకాణితో మర్యాద పూర్వకంగా..



కాకాణిని కలిసిన కాలనీ వాసులు

పొదలకూరు: మాజీ మంత్రి, జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డిని పట్టణంలోని కేఆర్ఆర్ నగర్‌కు చెందిన పంచాయతీ వార్డు సభ్యుడు ఎస్కే అంజాద్ ఆధ్వర్యంలో స్థానికులు ఆదివారం రాత్రి మర్యాద పూర్వకంగా కలిశారు. కేఆర్ఆర్ నగర్‌కు చెందిన పీ శకుంతలమ్మను వైఎస్సార్‌సీపీ సర్వేపల్లి నియోజకవర్గ అంగన్‌వాడీ వింగ్ అధ్యక్షురాలిగా నియమించారు. ఈ సందర్భంగా కాలనీకి చెందిన పార్టీ నాయకులు, అభిమానులతో కలిసి శకుంతలమ్మ కాకాణిని కలిసి కృతజ్ఞతలు తెలియజేశారు.

కొండలను కొల్లగొట్టేస్తున్నారు..



కొండ కింద గ్రావెల్‌ను లోడుతున్న యంత్రం



టిప్పర్లలో గ్రావెల్ తరలింపు

- అక్రమంగా గ్రావెల్ తరలింపు

పొదలకూరు: కూటమి ప్రభుత్వ పాలకుల అండ చూసుకుని కొందరు కొండలను కొల్లగొట్టేస్తున్నారు. మండలంలోని తాటిపర్తి గ్రామానికి సమీపంలో నెల్లూరు రూరల్ మండలం గొల్లకందుకూరు వద్ద కొండను యంత్రాలను పెట్టి తవ్వేసి గ్రావెల్ తీసి టిప్పర్లలో రాత్రి వేళల్లో అక్రమంగా తరలిస్తున్నారు. పొదలకూరులోని లేఅవుట్లకు గ్రావెల్‌ను తరలిస్తూ భారీగా సొమ్ము చేసుకుంటున్నారు. సంబంధిత అధికారులకు ఎన్ని పర్యాయాలు చుట్టు పక్కల గ్రామాల ప్రజలు ఫిర్యాదు చేసినా పట్టించుకోకపోవడంతో అడ్డూ అదుపు లేకుండా అక్రమ మట్టి, గ్రావెల్‌ను తరలిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. మైనింగ్, పోలీసు అధికారులు చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారని జిల్లా స్థాయి అధికారులకు కొందరు సోమవారం ఫిర్యాదు చేశారు.

రైతుల సమస్యలపై వినతి

పొదలకూరు : స్థానిక రెవెన్యూ కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజావిజ్ఞాప్తుల పరిష్కార వేదికలో ఇన్‌చార్జి తహసీల్దార్ సురేఖకు రైతులు తాము ఎదుర్కొంటున్న సమస్యలపై వినతులిచ్చారు. భూములకు సంబంధించి రెండు, వేరుశనగ పంట దెబ్బతిందని మరో వినతిపత్రం అందజేసినట్లు తహసీల్దార్ పేర్కొన్నారు. ఆయా సమస్యపై క్షేత్రస్థాయిలో పరిశీలించి నివేదిక ఇవ్వాలని వీఆర్వోలకు సూచించారు.

రైతులకు ప్రత్యేక గుర్తింపు నంబర్లు

కోవూరు: ఈ–పంట నమోదు చేయించుకున్న ప్రతి రైతు యూనిక్ నంబర్ కోసం గ్రామ వ్యవసాయ శాఖ సహాయకులను సంప్రదించాలని ఆ శాఖ సహాయ సంచాలకురాలు సుజాత అన్నారు. కోవూరులోని మూడో రైతు సేవా కేంద్రంలో సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ పీఎం కిసాన్, అన్నదాత, సుఖీభవ, సున్నా వడ్డీ తదితర పథకాలకు సదరు నంబర్ తీసుకున్న రైతులు మాత్రమే అర్హులన్నారు. ఈ పంటలో వివరాలు నమోదు చేసుకున్న వారు మాత్రమే తమ ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల ద్వారా అమ్మగలరన్నారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారిణి ఇందిరావతి తదితరులు పాల్గొన్నారు.

పరీక్షలకు 8 మంది గైర్హాజరు

వెంకటాచలం: విక్రమసింహపురి యూనివర్సిటీ (వీఎస్‌యూ) పరిధిలోని అనుబంధ కళాశాలల్లో సోమవారం నిర్వహించిన డిగ్రీ ఒకటో సెమిస్టర్, నాల్గో సెమిస్టర్ పరీక్షలకు 8 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని వీఎస్‌యూ పరీక్షల నిర్వహణాధికారి డాక్టర్ సీహెచ్ వెంకట్రాయులు తెలిపారు. మొత్తం 172 మంది విద్యార్థులకు 164 మంది హాజరు కాగా, 8 మంది గైర్హాజరయ్యారని పేర్కొన్నారు.

కండలేరులో 53.062 టీఎంసీలు

రాపూరు: కండలేరు జలాశయంలో సోమవారం నాటికి 53.062 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. సత్యసాయి గంగ కాలువకు 720, లోలెవల్ కాలువకు 150, హైలెవల్ కాలువకు 190, మొదటి బ్రాంచ్ కాలువకు 70 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు వెల్లడించారు.

ప్రార్థనా మందిరాన్ని తరలించండి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

మనుబోలు: మనుబోలు బీసీ కాలనీలో ఎటువంటి అనుమతులు లేకుండా ఏర్పాటు చేసిన ఓ ప్రార్థనా మందిరాన్ని అక్కడి నుంచి తరలించాలని కాలనీవాసులు డిమాండ్ చేస్తున్నారు. సోమవారం తహసీల్దార్ సీహెచ్ సుబ్బయ్యను కలిసి వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ బీసీ కాలనీలో కొన్నేళ్ల క్రితం ప్రభుత్వం ఇచ్చిన ఇంటి స్థలంలో ప్రార్థనా మందిరాన్ని ఏర్పాటు చేసి చుట్టు ప్రక్కల వారికి ఇబ్బంది కలిగిస్తున్నారని తెలిపారు. వారి వెంట సమరత సేవా ఫౌండేషన్ నాయకులు ఆలూరు రాము, గణపతి తదితరులు ఉన్నారు.

హైవేపై వాహన తనిఖీలు

సంగం : సంగం చెక్‌పోస్టు వద్ద జాతీయ రహదారిపై సీఐ వేమారెడ్డి, ఎస్సై రాజేష్ సోమవారం వాహన తనిఖీలు నిర్వహించారు. వాహనాలకు సంబంధించి లైసెన్స్, ఇతర ధ్రువపత్రాలను పరిశీలించారు. సరైన పత్రాలు లేనివారికి జరిమానా విధించారు.

పలువురికి ప్రసన్నకుమార్‌రెడ్డి పరామర్శ



రంగారెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ప్రసన్న



కేశవ కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ప్రసన్న, చలపతిరావు

కొడవలూరు: మండలంలోని దక్షిణ గండవరం సర్పంచ్ మారంరెడ్డి రంగారెడ్డి అత్త పుచ్చలపల్లి అనసూయమ్మ ఇటీవల మృతిచెందారు. తాటాకులదిన్నెలోని రంగారెడ్డి నివాసానికి వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి వీరి చలపతిరావులు సోమవారం వెళ్లి పరామర్శించారు. అలాగే కొడవలూరుకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు పొబ్బ రవి సోదరుడు కేశవ ఇటీవల అనారోగ్యంతో చనిపోయారు. దీంతో ఇంటికి ప్రసన్న, చలపతిరావులు వెళ్లి కేశవ కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో ఆ పార్టీ మండలాధ్యక్షుడు చిమటా శేషగిరిరావు, సర్పంచ్‌లు వల్లాపురం నవీన్, నలబాయి కామాక్షి, ఎంపీటీసీ సభ్యుడు ఎన్.ప్రతాప్, నాయకులు దేవిరెడ్డి సాయిరెడ్డి, జడ్డా సాయికుమార్, నక్కా తిరుపతమ్మ, వార్డు సభ్యురాలు పద్మావతి పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ నేతకు కాకాణి పరామర్శ



అజయ్‌రెడ్డిని పరామర్శిస్తున్న కాకాణి

మనుబోలు: వైఎస్సార్‌సీపీ జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి చిట్టమూరు అజయ్‌కుమార్‌రెడ్డిని మాజీమంత్రి, పార్టీ జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి ఆదివారం రాత్రి పరామర్శించారు. అజయ్‌రెడ్డి కొంత కాలంగా అనారోగ్యంతో హైదరాబాద్‌లో చికిత్స తీసుకున్నాడు. ఇటీవల మనుబోలుకు రావడంతో కాకాణి ఆయన ఇంటికి వెళ్లి పరామర్శించారు. కార్యక్రమంలో అజయ్‌రెడ్డి సతీమణి జెడ్పీటీసీ చిట్టమూరు అనితమ్మ, నాయకులు బొమ్మిరెడ్డి హరగోపాల్‌రెడ్డి, దాసరి భాస్కర్‌గౌడ్, చల్లా నవకోటి, చలగల దయాకర్, పార్థు, రాజేష్ తదితరులు ఉన్నారు.

భారత్ పెట్రోలియం పైప్‌లైన్ పనులు నిలివేయండి



పైప్‌లైన్ పనుల వద్ద పరిశీలిస్తున్న సోమిరెడ్డి

తోటపల్లిగూడూరు: రైతుల పంట పొలాల మధ్య భారత్ పెట్రోలియం సంస్థ ఏర్పాటు చేస్తున్న పైప్‌లైన్ పనులను వెంటనే నిలిపి వేయాలని సోమవారం సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి సూచించారు. కృష్ణపట్నం పోర్టు నుంచి హైదరాబాద్‌కు భారత్ పెట్రోలియం సంస్థ ప్రత్యేక పైప్‌లైన్‌ను ఏర్పాటు చేస్తోంది. అయితే వరి కోతల తరుణంలో పైప్‌లైన్ పనులను చేపట్టడం తగదని స్థానిక రైతులు ఆందోళన చేస్తున్నారు. ఈ క్రమంలో ఎమ్మెల్యే సంబంధిత అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బొమ్మి సురేంద్ర, మండల అధ్యక్షుడు సన్నారెడ్డి సురేష్‌రెడ్డి, నాయకులు సోమిరెడ్డి శ్రీనివాసులరెడ్డి, గూడూరు నారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణలపై అధికారులకు ఫిర్యాదు



డీఆర్‌ఓకు వినతిపత్రం ఇస్తున్న దళితులు

మనుబోలు: మండలంలోని జట్లకొండూరు గ్రామానికి చెందిన వెందోటి దయాకర్‌రెడ్డి తప్పుడు డాక్యుమెంట్లతో ఆక్రమించుకున్న భూములను విడిపించి తమకు న్యాయం చేయాలని గ్రామానికి చెందిన పలువురు దళితులు జిల్లా అధికారులకు విన్నవించారు. ఈ మేరకు వైఎస్సార్‌సీపీ నేత ఆవుల తులసీరాం ఆధ్వర్యంలో దళితులు సోమవారం నెల్లూరు కలెక్టరేట్‌లో డీఆర్‌ఓకు వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ నిడిగుంట చెరువు పరిధిలోని సర్వే నంబర్ 203, సర్వే నంబర్ 592-3లో ఉన్న 3.90 ఎకరాల ప్రభుత్వ భూమిని ఎవరికి పట్టాలు ఇవ్వకుండా ప్రభుత్వం గ్రామ అవసరాల నిమిత్తం గతంలోనే మినహాయింపు ఇచ్చిందన్నారు. అయితే ఆ భూమిని వెందోటి దయాకర్‌రెడ్డి తప్పుడు పత్రాలు సృష్టించి 1 బీలో నమోదు చేసుకుని ఫ్రీ హోల్డ్‌లో కూడా పెట్టించాడని ఆరోపించారు. ఈ భూమిని సిండికేట్ బ్యాంకులో తనఖా పెట్టి రుణం కూడా పొందాడని తెలిపారు. ఈ భూమితోపాటు చెరువు భూమిని కూడా ఆక్రమించుకున్నాడని ఆరోపించారు.

కల్తీ మద్యం విక్రేతలు అరెస్ట్



కల్తీ మద్యం తయారు చేసే వ్యక్తులను అరెస్ట్ చేసిన ఎక్సైజ్ పోలీసులు

వెంకటాచలం: కల్తీ మద్యం తయారు చేసి అమ్మకాలు చేస్తున్న వ్యక్తులను ఎక్సైజ్ పోలీసులు ఆదివారం రాత్రి అరెస్ట్ చేశారు. ఎక్సైజ్ సీఐ లక్ష్మీ ప్రసన్న వివరాల మేరకు.. నెల్లూరు నగరం బాలాజీనగర్‌కు చెందిన ఎస్కే ఆజాద్, వెంకటాచలం మండలం గొలగమూడికి చెందిన పవన్, వినోద్, బాబు, దామోదర్ సర్వేపల్లి వద్దనున్న ఎస్ఎన్‌జే డిస్టలరీ నుంచి కొంత మద్యం దొంగతనం చేసి ఆటోలో గొలగమూడి సమీపంలోని ఎస్కే ఆజాద్ నివాసంలో స్టాక్ చేసి నకిలీ మద్యం తయారు చేస్తున్నారనే సమాచారం ఎక్సైజ్ పోలీసులకు అందింది. దీంతో సీఐ లక్ష్మీ ప్రసన్న తన సిబ్బందితో కలిసి ఆదివారం రాత్రి ఆజాద్ నివాసంలో దాడులు చేశారు. ఈ దాడుల్లో ఆజాద్, పవన్, వినోద్, బాబు, దామోదర్‌లను అదుపులోకి తీసుకున్నారు. గదిలో మద్యం నిల్వ చేసే క్యాన్లు, కల్తీ మద్యం తయారీ కోసం సిద్ధంగా ఉంచిన 180 ఎంఎల్, 360 ఎంఎల్ ఖాళీ బాటిల్స్, మద్యం బాటిల్స్ మూతలను స్వాధీనం చేసుకుని నిందితులపై కేసు నమోదు చేశారు. నిందితులను సోమవారం ఎక్సైజ్ మేజిస్ట్రేట్ ఎదుట హాజరుపరచగా రిమాండ్ విధించారు.

బైక్‌ను ఢీకొట్టిన గుర్తుతెలియని వాహనం

- ఇద్దరికి తీవ్ర గాయాలు
- పరిస్థితి విషమం



తీవ్రంగా గాయపడిన వెంకట్రావు

కొడవలూరు: మోటార్‌బైక్‌ను గుర్తుతెలియని వాహనం ఢీకొట్టగా అందులో ప్రయాణిస్తున్న ఇద్దరు వ్యక్తులు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటన మండలంలోని నాయుడుపాళెం వద్ద జాతీయ రహదారిపై సోమవారం జరిగింది. పోలీసులు, స్థానికుల కథనం మేరకు.. ఇక్కడ రోడ్డు మరమ్మతులు చేస్తుండటంతో ఒక వైపు మాత్రమే వాహనాల రాకపోకలు జరుగుతున్నాయి. కావలి వైపు నుంచి వేగంగా వచ్చిన గుర్తుతెలియని వాహనం కావలి వైపు బైక్‌పై ప్రయాణిస్తున్న వారిని ఢీకొట్టి వెళ్లిపోయింది. దీంతో బైక్ నడుపుతున్న కావలి మండలం అనగానిపాళేనికి చెందిన ఎ.వెంకట్రావు, వెనుక కూర్చొన్న బిట్రగుంటకు చెందిన వెంకటేశ్వర్లు తీవ్రంగా గాయపడ్డారు. వెంకట్రావును 108 అంబులెన్స్‌లో నెల్లూరులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. తీవ్ర గాయాలతో ఉన్న వెంకటేశ్వర్లును హైవే మొబైల్ అంబులెన్స్‌లో నెల్లూరులోని ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. ఇద్దరి పరిస్థితి విషమంగా ఉందని బాధితుల బంధువులు తెలిపారు. పోలీసులకు సమాచారం అందించారు.

త్రైత సిద్ధాంత భగద్గీత ప్రచారం



భగద్గీత ప్రచారం చేస్తున్న త్రైత సిద్ధాంత కర్తలు

పొదలకూరు: మండలంలోని తాటిపర్తి, నల్లపాళెం, వరదాపురంలో త్రైత సిద్ధాంత భగద్గీత ప్రచారాన్ని మండల కన్వీనర్ జీ పెంచలనర్సయ్య ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి శివరాత్రి పండగ విశిష్టతను వెల్లడించారు. శివలింగంపై ఉన్న మూడు విభూతి రేఖలు జీవాత్మ ఆత్మ పరమాత్మలకు గుర్తులని, ఆత్మను ఆరాధిస్తే జీవుడు మోక్షం పొందుతాడని తెలిపారు. ఈ కార్యక్రమంలో మధు, కిషోర్, పద్మమ్మ, శేషాద్రి, నర్సారెడ్డి, భాగ్యమ్మ, సుధాకరాచారి, కొండయ్య, గాయత్రి, పృథ్వీ, సీహెచ్ పద్మమ్మ పాల్గొన్నారు.